# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  19-01-2025                    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఓటు హక్కును వినియోగించుకుంటూ... పౌరులు పటిష్టమైన ప్రజాస్వామ్యానికి దోహదపడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
- ❖ విపత్తుల సమయంలో జాతీయ విపత్తు నిర్వహణ దళం (ఎన్డీఆర్ఎఫ్) ముందు స్థానంలో నిలబడి సేవలను అందిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం మూడింతల ప్రగతి సాధిస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా 4 కోట్ల మందికి ప్రభుత్వం కేన్సర్ స్క్రీనింగ్ పరిక్షలను నిర్వహిస్తోందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

=========================

భారత దేశ పటిష్టమైన ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. మనసులోని భావాలను ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 118వ సంచికలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... జాతీయ ఓటర్ల దినోత్సవం జనవరి 25వ తేదీ ఎంతో ముఖ్యమైన రోజు అని, ఆ రోజు భారత ఎన్నికల సంఘం ఏర్పడిందని ప్రధానమంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యాని బలోపేతం చేసేందుకు ఎన్నికల సంఘం సాంకేతికతను ఉపయోగిస్తూ.. ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్ఠం చేస్తోందని ప్రధానమంత్రి కొనియాడారు. దేశ పౌరులందరూ ఎల్లప్పుడూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటూ.. దేశ ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడాలని నరేంద్ర మోదీ సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

ఏ విపత్తు వచ్చినా జాతీయ విపత్తు నిర్వహణ దళం (ఎన్డీఆర్ఎఫ్) ముందు స్థానంలో నిలబడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... జపాన్, నేపాల్, తుర్కియేలో ప్రకృతి విపత్తులు వచ్చినపుడు ఎన్డీఆర్ఎఫ్ సేవలు అందించిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర యంత్రాంగం పరిష్కరించలేని సమస్యలను సైతం ఎన్డీఆర్ఎఫ్ పరిష్కరించిందని చెప్పారు. 5 రాష్ట్రాలకు శిక్షణ ఇచ్చేలా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం) ప్రాంగణాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశామని, ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్, ఎన్ఐడీఎం ప్రాంగణాలకు 50 ఎకరాల భూమి కేటాయించామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

విపత్తుల సమయంలో జాతీయ విపత్తు నిర్వహణ దళం అందించే సేవలు ఎనలేనివని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో నిర్వహించిన 20వ జాతీయ విపత్తు నిర్వహణ దళం.. ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు, ఇతర సమయాలలో ఎన్డీఆర్ఎఫ్ చేసే సేవలను ఇతర దేశాల నేతలూ సైతం ప్రశంసించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాధిస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్తామని, 2028లోపు రాష్ట్రానికి పోలవరం ద్వారా నీళ్లు అందిస్తామని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

అంతకు ముందు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ..ఎన్ఐడీఎం ప్రాంగణాన్ని, ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ భవనాన్ని అమిత్ షా ప్రారంభించారు.

విరామం

========================

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈరోజు విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు కేంద్రమంత్రికి ప్రసాదములు, చిత్రపటం అందజేశారు.

========================

రాష్ట్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వహించిన మనసులో మాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. శ్రీకాకుళం జిల్లా కంబాలపేట గ్రామంలో “మన్ కీ బాత్” కార్యక్రమాన్ని శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు ప్రజలతో కలిసి వీక్షించారు.

అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పట్టణాల మొదలుకొని పల్లెల వరకు అనేక ప్రాంతాల్లో ప్రధానమంత్రి “మన్ కీ బాత్” కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రధానంగా మన్ కి బాత్ లో యువతను చైతన్య పరిచేలా ప్రధానమంత్రి ప్రసంగం ఉంటుందని యువత అభిప్రాయపడ్డారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో జరిగే విశేషాలను మనసులో మాట కార్యక్రమంలో వీక్షించగలుగుతున్నామని తెలిపారు.

========================

'విపత్తు నిర్వహణ గ్రామ స్థాయిలోనూ జరగాలని, దీనికి ఒక పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపావులూరులో జరిగిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న ఉప

ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రతి పంచాయతీ పరిధిలో విపత్తు సమయంలో సత్వరం స్పందించి, ఆపదలో ఉన్న వారిని కాపాడే బృందాలను తయారు చేస్తామన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నూతన హంగులతో, సాంకేతికను అందిపుచ్చుకొని ముందుకు వెళ్తోందని, 2047 వికసిత్ భారత్ లక్ష్య సాధనలో విపత్తుల నిర్వహణ ఎంతో కీలకమని అన్నారు.

========================

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 4 కోట్ల మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోందని.. ప్రజలు తమవంతు సహకారం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. 6 నెలలు నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు 44 రకాల వ్యాధులను గుర్తించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని ఆయన తెలిపారు. విశాఖ పర్యటనలో భాగంగా గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాలలో నూతనంగా నిర్మించిన 50 పడకల డాక్టర్ హెడ్గే వార్ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా గుడిలోవ విజ్ఞాన విహార్ 4 దశాబ్దాలకు పైబడి సేవలు అందిస్తోందన్నారు. నూతన విద్యావిధానం బానిసవాదం నుంచి భావితరాలను కాపాడమే లక్ష్యంగా రూపొందించబడిందన్నారు. ఆహార అలవాట్లు, జీవనశైలిలో వస్తోన్న మార్పులు కేన్సర్ కు ప్రధాన కారణంగా మారుతున్నాయని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. రాయచోటి మండలం దూడ్లవాళ్లపల్లె రోడ్డులో 80 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి నియోజకవర్గంలో ఉన్న 720 గ్రామాలకు జల్ జీవన్ మిషన్, అమృత ధార పథకాల ద్వారా నీటిని అందిస్తామని తెలిపారు.

========================
========================